**జరిగిన కథ :** కాశీలో చదువుకున్న ఏడుగురు మిత్రులలో ఒకడైన దత్తకుడు.. యక్షుని శాపం వల్ల స్త్రీగా మారాడు. చారుమతిగా రాకుమారి రుక్మిణి అంతఃపురంలో ఏడాదిపాటు గడిపి.. ఆమెకు సన్నిహితురాలిగా మెలిగాడు. అదే సమయంలో యువరాజు చిత్రసేనుడు ఆడవేషంలో ఉన్న దత్తకుడిని మోహించాడు. దత్తకుడి స్నేహితుడైన గోణికాపుత్రుని సాయంతో.. చారుమతిని పొందాలని ప్రయత్నించి విఫలమయ్యాడు.







# యక్షిణీ గానం

అనుసృజన: **నేతి సూర్యనారాయణ శర్మ**

''నా అనుమతి లేకుండా రుక్మిణి అంతఃపురం నుంచి ఎవరినీ బయటికి వెళ్లనీయకండి'' అని చిత్రసేనుడు ఆజ్ఞలు జారీచేశాడు.

దత్తకుడిని, గోణికాపుత్రుణ్ని తీసుకురమ్మని భటులను పంపాడు.

గోణికాపుత్రుడు విచారవదనంతో వచ్చి..

''నిన్నటినుంచి దత్తకుడు కనిపించడం లేదు ప్రభూ!'' అని చెప్పాడు.

చిత్రసేనుడికి ఉత్సాహం చప్పగా చల్లారిపోయింది.

''వెంటనే వెళ్లండి. ఆయన ఎక్కడున్నాడో తెలుసుకోండి. నేను కూడా భటులతో వెతికిస్తాను'' అన్నాడు.

'అయ్యయ్యో! నా మిత్రుడు ఎటుపోయాడో? వచ్చినా అతనేమి చేయగలడో కదా! అంతా దైవేచ్ఛ' అనుకుంటూ గోణికాపుత్రుడు ధారానగరమంతా వెతకసాగాడు.

కొన్నిరోజులు గడిచిపోయాయి. దత్తకుడు సమయం కనిపెట్టి అంతఃపురం నుంచి జారుకున్నాడు. మగవేషంలో గోణికాపుత్రుని వద్దకు వెళ్లాడు. దత్తకుణ్ని చూడగానే పోగొట్టుకున్న నిధి మళ్లీ దొరికినట్లయింది అతనికి.

''మిత్రమా! ఎక్కడికి వెళ్లిపోయావు? అవతల చారుమతి తిరిగి వచ్చేసింది. రాజపుత్రుడు నీకోసం వర్తమానం మీద వర్తమానం పంపుతున్నాడు. నువ్వు లేకుండా నేనొక్కణ్నే వెళ్తే నామీద మండిపడుతున్నాడు. నీకోసం వెతకలేక నా చావుకొచ్చింది'' అన్నాడు.

అతణ్ని వెంటపెట్టుకుని రాజభవనానికి వెళ్లాడు.

దత్తకుణ్ని చూడగానే చిత్రసేనుడు ఉప్పొంగిపోయాడు. ఆలింగనం చేసుకుని..

''మిత్రమా! నామీద దయ తప్పిందా ఏమిటి? ఇన్నాళ్లు ఎక్కడికి వెళ్లిపోయావు?! నీకోసం చూసిచూసి నా కళ్లు కాయలు కాచిపోయాయి. నీమాట చెల్లించుకోవాల్సిన సమయం వచ్చింది. ఇక వర్తమానాలతో పని లేదు. మనమిప్పుడే అక్కడికి పోదాం. ఆ చారుమతిని ఏదో మిషచేత నీకంట పడేలా చేస్తాను'' అన్నాడు.

అందుకు దత్తకుడు..

''ఆమెను నీ దాసురాలిగా చేయకపోతే నన్ను నా పేరుతో పిలవొద్దు'' అని ప్రతిజ్ఞ చేశాడు.

ముగ్గురూ కలిసి రుక్మిణి అంతఃపురానికి వెళ్లారు.

''అన్నా! నువ్వు ఆమెకోసం పలుమార్లు ఆరాలు తీస్తున్నావని నీకు జడిసి.. నిన్న ఉద్యానంలో నుంచి నాకు చెప్పకుండానే ఎక్కడికో పోయింది'' అని జరిగింది చెప్పింది రుక్మిణి.

చిత్రసేనుడికి అరికాలిమంట నెత్తికెక్కింది.

''చాలు రుక్మిణీ! దానికి ఈ టక్కులు నీ మూలంగానే వచ్చాయి. సభలలో ఆడే వెలయాలికి అంతఃపుర వాసమెందుకు?! నీ అండన ఉండటం వల్లకానీ లేకపోతే దానిని బలవంతంగానైనా తీసుకురాక పోయానా? ఏదో విద్వాంసురాలని, పండితులతో వాదిస్తుందని వేడుక పడ్డాను కానీ, లేకపోతే దానిగోల మాకేల?!'' అని రుసరుసలాడుతూ అక్కణ్నుంచి వెళ్లిపోయాడు.

అప్పుడు దత్తకుడు..

''రాజపుత్రా! ఆమె వచ్చినప్పుడు మళ్లీ వస్తాను. నాకప్పుడు అనుజ్ఞ ఇప్పించండి'' అని అడిగాడు.

''చాలుచాలు నిన్ను పోనీయను. దాని రాక ఎప్పుడో తెలియదు. కనుక అంతవరకూ మీరిద్దరూ నా మందిరంలోనే ఉండాలి'' అని నిర్బంధించాడు చిత్రసేనుడు.

రోజులు గడిచిపోతున్నాయి కానీ, చారుమతి జాడ తెలియలేదు. ఒకనాడు కొందరు వార్తాహరులు వచ్చి..

'ఉత్తరదేశం నుంచి వచ్చిన ఒక కళాకారిణి ధారానగరంలోని నాటకశాలలో మొన్న వీణాగానం చేసింది. ఆమె గానం దేవగానమేనని మనవారు స్తోత్రాలు చేస్తున్నారు. ఆమె నేటిరాత్రికి మళ్లీ తన ప్రదర్శన ఇస్తున్నది' అని నివేదించారు.

''దత్తకా! ఆమె చారుమతి కావచ్చునేమో. మనం కూడా వెళ్దాం పద'' అన్నాడు చిత్రసేనుడు.

చిత్రసేనుడితో పాటు దత్తకుడు, గోణికాపుత్రుడు ప్రదర్శనకు వెళ్లారు. కళాకారిణి వచ్చి వేదికపై కూర్చుంది. ముందుగా ప్రార్థనాగీతం ఆలపిస్తూ...

''గొప్ప విద్యాప్రభావం కలవాడు.. పాపభూయిష్ఠమైన లోభాన్ని జయించినవాడు అయిన నా పతి సువర్ణనాభునికి నమస్కరిస్తున్నాను'' అన్నది.

ఆ మాట వినగానే దత్తకుడు, గోణికాపుత్రుడు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

'ఆ సువర్ణనాభుడు మన మిత్రుడేనేమో!' అనే అనుమానం గోచరించిన వారి అంతరంగాలు వాళ్లిద్దరికీ మాత్రమే అర్థమయ్యాయి.

''ఈమె చారుమతి కాదు. ఇక ఇక్కడుండి లాభం ఏముంది? పదండి పోదాం'' అన్నాడు చిత్రసేనుడు.

''యువరాజా! మేము ప్రదర్శన చివరిదాకా చూసి